# భీతి హారిణి

రచన:
శ్రీ కె. పి. బాబు

దేశ దిమ్మరినని పేరుపొందిన నేను మద్రాస్ కొచ్చి మూడు నెలలై పోయిందంటే-'ఇంతకాలం యిక్కడే ఎలా వుండిపోయానా?' అని నాకే ఆశ్చర్యం వేసింది. తిరిగే కాలూ, తిట్టే నోరూ ఊరకుండవు అంటారు గదా మరి!

ఇక ఒక మంచిరోజు చూచి మద్రాస్ వదిలిపోవాలని నిశ్చయించుకున్నాను. ఐతే, ఎక్కడకి వెళ్ళాలి అన్నది ఒక పట్టాన తేలలేదు. అంతలోనే విజయవాడనుండి నాకో శుభలేఖ చేరింది. భానుమూర్తి నా బాల్య మిత్రుడు. చిత్రకళలో ఆసక్తీ-శక్తీ వున్నవాడు. డ్రాయింగ్ టీచర్‌గా జీవిస్తున్నాడు, వాడి వివాహ మనీ, తప్పక రావలసిందనీ ఆ లేఖ తెలియజేసింది. వధువు ఎవరా అని చూస్తే-సుగుణ అని వుంది. ఆమెదీ విజయవాడే. పైగా, కళాభిరుచి గలది. నా కామె కుటుంబంతో కూడా పరిచయముంది. ఈడూ జోడే కాకుండా అభిరుచులు కూడా చక్కగా కుదిరిన జంట అనుకుని, ఆనందంతో ఆనాటిరాత్రే కలకత్తా మెయిల్ ఎక్కేశాను.

విజయవాడ చేరగానే తిన్నగా భానుమూర్తి ఇంటికి వెళ్ళాను. పెళ్ళి పనులు జోరుగా జరుగుతున్నాయి. నన్ను చూచి భానుమూర్తి ముఖమింత చేసుకుని. 'నువ్వు మద్రాస్‌లో వున్నావో-లేవో; ఉన్నా వస్తావో-రావో అనుకుంటూ వచ్చాను సుమా!' అన్నాడు. ప్రక్కవీధి లోనే సుగుణ వాళ్ళ యిల్లు. నారాక సంగతి తెలియ గానే వాళ్ళు కబురంపారు. వెళ్ళాను. 'ఎంతైనా మీ మగబుద్ధి పోనిచ్చుకున్నావు కాదు' అంటూ సుగుణ చనువుకొద్దీ నామీదికి విరుచుకు పడింది. వాళ్ళు ప్రత్యే కించి మరీమరీ వ్రాశారుట నాకు-వస్తే వాళ్ళింట్లోనే బస చేయాలని. ఆ ఉత్తరం భానుమూర్తి వాళ్ళు వ్రాసిన దానికన్నా ఒక రోజు ఆలశ్యంగా పోస్టు చేయడం వల్ల నాకందలేదు. దానికి నేనేం చేసేదన్నా వాళ్ళూరుకో లేదు. అందువల్ల పెళ్ళికొడుకు యింట్లో బసచేసి, పెళ్ళి కూతురు యింట్లో జరిగే పనులను అజమాయిషీ చేస్తూ మసలాల్సి వచ్చింది నేను. అందుకని, 'సత్రం భోజనం, మఠం నిద్ర! బాగుందమ్మా-చాలా బాగుంది నాపని!' అని నాకు నేనే అంటూ నవ్వించేవాడిని వాళ్ళందరినీ. 'నీ బతుకే అంతగదా, మరేం ఫర్వాలేదులే!' అని ఎత్తి పొడిచేవారు కొందరు-తమాషాగా నన్ను. అలా సంతోషసంరంభాలతో రోజులు క్షణాల్లా గడిచిపోసా గాయి. పెళ్ళి దగ్గర పడసాగింది.

ఒకనాటి ఉదయం భానుమూర్తి యింట్లో కాల కృత్యాలు తీర్చుకుని, కాఫీ త్రాగి, అలా సుగుణ యింటికి వెళ్ళాను. ఆమె నేను కనిపించగానే ఏదో బజారు పని చెప్పి 'కొంచెం వెళ్ళొస్తావా బాబూ?' అంది.

'తప్పుతుందామ్మా' కానీ-డబ్బేదీ?' అన్నాను.

'మేడమీద శాంతమ్మ వుంది. నువ్వొస్తే యిమ్మని చెప్పాను యిందాకే వెళ్ళి-తీసుకో. నాకిక్కడ బోలె డంత పనుంది' అంటూనే ఆమె మరోగదిలోకి వెళ్ళి పోయింది.

నేను మెల్లగా మెట్లెక్కి మేడమీదికి వెళ్ళాను. అక్కడ హాల్లో ఒంటరిగా ఒక యువతి గచ్చుమీద సుద్దతో ముగ్గులు వేస్తూ, కూనిరాగాలు తీస్తూ వుదిం. ఆమె నంతకు ముందు నేనెరుగను.

'ఏమండీ, శాంతమ్మగారంట-' అనడగ బోయా నామెను, అందం చూస్తూ.

ఆమె అంతలోనే వెనుదిరిగి నన్ను చూచి తెల్లపోతూ నిలబడి, 'ఆఁ! ఏంకావాలండీ?' అంది మెల్లగా.

'శాంతమ్మగారట-'

మళ్ళీ నామాట కడ్డొస్తూ ఆమె, 'నేనేనండీ!' అందామె.

నేను చకితుణ్ణయాను. 'శాంతమ్మ' అని సుగుణ చెప్తే-ఏ అవ్వనో, ప్రౌఢనో ఉద్దేశించి అలా అన్నదనుకున్నానే గాని, ఆ 'శాంతమ్మ' జవరాలై వుంటుందని ఎంత మాత్రం ఊహించలేకపోయాను. అందువల్ల కాస్సేపు తికమకపడి, 'మీరేనా? సుగుణ మిమ్మల్నడిగి పది రూపాయలు పుచ్చుకొమ్మంది; బజారు కెళ్ళాలి' అని అడిగాను,

'అవునండోయ్! ఇందాకనే చెప్పింది - 'మా బాబొస్తాడు శాంతమ్మా, బజారుకు పంపాలి' అని మద్రాసు నుంచొచ్చిన బాబంటే సూటూ, బూటూ, హేటూ వుంటాయనుకున్నాను సుమాండి!' అందామె, నాలాంగ్ క్లాత్ పైజామా, జుబ్బాలను చూస్తూ.

'మీ విషయమై నేను పొరబడ్డట్లు, నా విషయమై మీరూ పొరబడ్డారన్నమాట! బాగుంది!' అన్నాను చిరునవ్వుతో.

'అదేమిటండోయ్?' అందామె కళ్లింత చేసుకుని.

'మరేంలేదు. 'శాంతమ్మ' అని సుగుణ చెప్తే, ఏవయసు మళ్లినామో అనుకుంటూ యిలా వచ్చాను. మద్రాస్ నుంచివచ్చానని విన్న మీరు నేను ఏ దొరవేషంలోనో కపిస్తాననుకున్నారు, ఇద్దరి ఊహలూ ఆటర్ ఫెయిల్యూర్ అయ్యాయిగదా!' అన్నాను మళ్లీ నవ్వుతూ.

ఆమెకూడా ముసిముసి నవ్వులు చిందిస్తూ, బొడ్లోంచి డబ్బు తీసి నాకిస్తూ, 'మీరు భలే తమాషాగా మాట్లాడారండీ!' అంది, అమాయకంగా.

నేను జవాబుయివ్వకుండా డబ్బుందుకుని మందహాసంతోనే క్రిందికి వెళ్లిపోయాను...

ఇటు సుగుణ యింటికీ- అటు భానుమూర్తి యింటికీ బంధుమిత్రులనేకులు వచ్చారు. వారిలో చాలామంది శాంతమ్మ యీడు యువతులు, నాకు చిరపరిచితులైన వారూ వున్నారు. అయినా, నాకు పదేపదే శాంతమ్మే కళ్లముందాడ జొచ్చింది. మెళ్లో మామిడిపిందెల నెక్లెస్, చేతులకి బంగారు వంకీగాజులు, కాళ్లకు సన్నని పట్టాలు, చెవులకూ, ముక్కుకీ నత్తుతాదుద్దులూ-పుడకా! ఎప్పుడూ తెల్లటి చీర-జాకెట్లు ధరిస్తూ, పొడుగైన నల్లని తల వెంట్రుకల్ని అందగా ముడివేసుకుని, బేల చూపులతో మధురంగా మాట్లాడుతూవుండేది. చామనఛాయ, కాయ కరీరం, ఆకర్షణీయమైన చిరునవ్వులతో మళ్లిమళ్లీ చూడా కన్పించేది... శాంతమ్మ నన్నాకర్షించడానికి వీటన్నింటికీ మించిన కారణాన్ని కలిగించిన సంఘటన ఒకటి ఒకనాడు సంభవించింది.

ఆనాడు-యథాపూర్వకంగా నేను సుగుణ యింటికి వెళ్లాను. నేను వెళ్లేసరికి ఆయిల్లంతా గంద్రగోళంగా వుంది. ఇంట్లోవాళ్లంతా ఆదుర్దాగా అటూ - యిటూ పరుగెత్తుతున్నారు. నేను కంగారుపడి, గబగబాలోనకు పోయాను. మూలగదిలో శాంతమ్మ నేలమీద స్పృహ తప్పి పడివుంది. ఆమెకు తెలివి రప్పించడానికి ఎవరికి తోచినది వారు చేస్తున్నారు-గుమిగూడి.

కళవరపడుతూ, కాలుగాలిన పిల్లిలా తచ్చాడుతున్న సుగుణ దగ్గరకు వెళ్లి 'ఏం జరిగింది?' అని అడిగాను ఆత్రంగా.

'ఏంలేదు బాబూ! మా అమ్మానాన్నా దేనిగురించో వాదులాడుకున్నారిందాక. అది చిలికి చిలికి గాలివానలాగై, నాన్న అమ్మని కొట్టినంత పనిచేశాడు. అప్పుడక్కడేవున్న శాంతమ్మా, ఆయన మా అమ్మని కొట్టునంటూ చెయ్యెత్తడం చూచి-కెవ్వునఅరచి, యిలా విరుచుకు పడిపోయింది...' అని చెప్పింది సుగుణ.

నేను కొన్నిక్షణాలూరుకుని, 'ఆమె యిలా స్పృహ తప్పి పడిపోవడానికి యిదే ప్రథమమా? నీకేమన్నా తెలుసా?' అనడిగాను.

'నాకు తెలిసినంతవరకూ యిదే ఫస్ట్ టైం బాబూ!' అంది సుగుణ తడబడుతూ.

'ఎందుకు మధ్య నువ్విలా కంగారుపడతావ్? అయిదారు నిమిషాలాగితే, ఆమె అంతట ఆమెలేచి కూర్చుంటుంది' అని నేనంటున్నంతలోనే శాంతమ్మకు స్పృహ వచ్చేసింది. మెల్లగా కళ్లు తెరిచి, తనచుట్టూ మూగిన వారిని చూచి తెల్లబోతూలేచి, మెల్లగా ప్రక్కగది లోకి వెళ్లిపోయింది.

నేను మేడమీదికి వెళ్లి, హాల్లోవున్న రేడియో ట్యూన్ చేసి-సంగీతాస్వాదనచేస్తూ, ఆ హాల్లో శాంతమ్మ పెట్టిన ముగ్గుల రామణీయకతను పరిశీలిస్తూ, ఆలోచిస్తూ కూర్చున్నానో కుర్చీలో... సుగుణ తల్లీ తండ్రీ ఏదో తగువులాడుకుంటే-మధ్య యీ శాంతమ్మ భయకంపితురాలై-మూర్ఛపోవడమేమిటి?... చట్టున నాకు శాంతమ్మ విగ్రహం స్ఫురణ కొచ్చింది. ఆమె ఎప్పుడూ చీరెలూ-జాకెట్లూ తెల్లనివే ధరిస్తుంది, తల్లో పూలు పెట్టుకోదు. ముఖాన బొట్టూ వున్నట్లు తోచదు. కొంపదీసి ఆమె...? ఎందుకో ఆపైన నేనూహించకపోయాను. మనస్సొప్పలేదు. అయితే, రచయితగా నాకుండే

(తరువాయి 86వ పేజీలో)

ALWAYS USE
ARUNA
BANIANS




* అరుణ *

బనియన్లనే ఉపయోగించండి.

అవి:-చిరకాల మన్నికకూ - రకానికీ,

అత్యుత్తమమైనది.

అత్యుత్తమమయిన సాదా, వల బనియన్ల, నూలు స్వెటర్ల, ఉత్పత్తిదారులు.

ARUNACHALAM KNITTING FACTORY.,
KARUR

అరుణాచలం నిట్టింగ్ ఫాక్టరి.,
కరూరు (S. I.)


(10వ పేజీ తరువాయి)

ఆసక్తి వేరు కనుక-తరువాత సుగుణ ఒంటరిగా ఉన్నప్పుడు అడిగాను.

'అవును బాబూ! పాపం టీచిర్-ట్రైనింగ్ పూర్తయి, పరీక్షలకు కూర్చునే సమయానికి వాళ్ళ అత్తారూరినుండి కబురొచ్చింది. శాంతమ్మ అప్పుడు అత్తారూళ్ళోనూ కాక, పుట్టింటివద్దా లేక - యిక్కడ ట్రయినింగ్ స్కూల్ హాస్టల్లో వుంటూ, టీచర్ ట్రయినింగ వుతోంది. పరీక్షలు రాసేసేదాకా ఆ సంగతి ఆమెకు తెలియనివ్వకుండా చూచారందరూ; ఎక్కడ బేజారై - ఫెయిలవుతుందో పాపమని! కానీ, పరీక్షలు పూర్తయ్యాక ఆ సంగతి చెప్తే ఎంత గుండె నిబ్బరం చూపిందనుకున్నావ్! 'ఏం చేస్తాను? నా రాత యిలాగుంది కాబోలు - కానివ్వండి! అన్నది తప్ప, గట్టిగా ఏడవనన్నా ఏడవలేదనుకో...' అని చెప్పింది సుగుణ.

'మరి ఇంత చిన్న వయస్సులో...మళ్ళీ పెళ్ళి...' అని గొణిగాను స్వగతంగా.

'ఓ. స్నేహితులందరం ఎంతో బలవంతం చేశాం. ఆమె తల్లితండ్రులు కూడా వాళ్ళ వంశంలో లేవి ఆ పనిని యీమెకోసం చేయడానికి నడుం బిగించారు. కాని - శాంతమ్మే అందర్నీ కాదనేసింది. నేనిలాగే బ్రతగ్గలను. నాగురించి ఎవరూ ఏమీ బాధపడక్కర్లేదు. నన్నిలాగే బ్రతకనివ్వండి - మీకు పుణ్యముంటుంది!' అని మొత్తుకొని, మొరపెట్టి, అందరికీ ఆశాభంగం చేసింది...' అని సుగుణ నిట్టూర్చింది.

నేను ఏమీ తోచక పట్నం ముక్కుపొడి ఒక పట్టు పట్టాను. అది చాలక, సిజర్స్ సిగరెట్టొకటి ముట్టించాను. అప్పటికీ శాంతమ్మ తత్వం నాకేమీ అంతు చిక్కలేదు...

ఆ రోజు నే కనుచీకటి వేళ ఆ మేడమీద నే నేనుండటం తటసించింది. రేడియో వింటూ, సిగరెట్ కాలుస్తూ, ఏవో ఆలోచిస్తూ కూర్చున్నాను. చట్టున ఎలెక్ట్రిక్ లైట్ వెలిగింది. నేనులిక్కిపడి చూచాను. నా ఎదుట నవ్వుతూ నిల్చుంది - శాంతమ్మ!...ఆ విద్యుద్దీప కాంతిలో ఆమె మరింత ఆకర్షణీయంగా కనిపించింది.

'ఓ. మీరిక్కడ వున్నారా?' అంది, నన్నప్పుడే చూచినట్లు.

'అవునుగాని - నేనొకటి అడుగుతాను, నిజం చెప్తారూ?' అన్నాను.

ఆమె వింతగా నావంకే చూస్తూ, 'ఎంత మాట! అడగండీ! నాకు తెలిసినంతవరకూ నిజమే చెప్తాను అంది.

'ఉదయం మీరలా—'

'నేనా? ఎలా?' అంది మనస్సులోనే - ఏమీ ఎరగనట్లు.

నేనది పట్టించుకోకుండా, 'ఉదయం మీరలా మూర్ఛపోవడానికి కారణం అభ్యంతరం లేకపోతే చెప్తారా?' అనడిగేశాను.

'ఓ-అదా! ఆ విషయం గుర్తుకు తేబోకండీ, మీకెంతైనా పుణ్యముంటుంది; మళ్ళీ పడిపోతానేమో!...' అని, కొన్ని క్షణాలాగి తనంతట తానే చెప్పసాగింది. '...సుగుణ నాన్నగారేమో శాంతమూర్తి. ధర్మప్రభువూ అనుకున్నానింతకాలమూ. కాని. ఆయనెంత కోపధారి! ఎటువంటి కఠిన హృదయం ఆయనది!... అమ్మ బాబోయ్! ఏదో కష్టాలకీ, కన్నీళ్ళకీ కాస్త దూరంగా-ఇలా పదిమందిలో పడి రుగుతూ, ఇంత శాంతినీ-సౌఖ్యాన్నీ పొందుదామని వచ్చాను. కాని, ఇక్కడా ఆ నరకమేనా బాబూ! సుగుణ అమ్మగారేదో చిన్న తప్పు చేశారట-అదీ తెలిసి కాదు; పొరబాటున. దానికే ఆమెను కొట్టేసినంత పని చేశారాయన. సరిగ్గా ఆ సమయానికి పాపిష్టి దాన్ని నేనక్కడ ఉండడమేమిటి? ఎందుకో నేనా దౌర్జన్యం చూడలేక పోయానండీ! మనసంతా చెదిరిపోయింది. ఒళ్ళంతా కదిలిపోయినట్లయింది. అంతే! తర్వాత ఏమైందో నాకేం తెలియదు. తిరిగి నేను మీ అందరి మధ్యనుండి లేవడమే తెలుసు-అంతే!' అని ఆగింది.

నేను మరో సిగరెట్ ముట్టించి, 'ఊఁ!' అన్నాను యాధాలాపంగా.

'ఆయన చుట్ట కాల్చేవారు. మస్తుగా తాగేవారు ముండలతో తత్తకార్తె కుక్కలా తిరిగేవారు. అయినా అన్నీ సహించేదాన్ని. కాని-అనుమానాలతో, అన్యాయంగా, అకారణంగా ఆయన నన్ను కొట్టూ వుంటే మాత్రం భరించలేక పోయేదాన్ని. చర్మం చిట్లేటట్లు, ఎముకలు విరిగి పోయేటట్లు కొట్టి హింసిస్తుంటే— అ...బ్బ...' అని, ఆపైన చెప్పలేక శాంతమ్మ వెక్కి వెక్కి ఏడ్వనారంభించింది.

నేను త్రుళ్ళిపడి. 'మీరింత బాధ పడతారని తెలిస్తే, అసలీ ప్రస్తావనే తేక పోదును. క్షమించండి-'అన్నాను మెల్లగా,


# SREEVATSA ENGINEERING & TRADING CO.,

(CIVIL MECHANICAL & STRUCTURAL ENGINEERS)

*H. O. & WORKS* .
SARDAR PATEL ROAD.
COIMBATORE.

316, THAMBU CHETTY STREET,
MADRAS-1.

*MANUFACTURERS* :

Tractor Trailers
A. D. V. Carts
Wheel Barrows
Sack Trucks
Steel Water Tanks
Deepwell Hand Pumps
Deepwell Power Pumps
Etc.,

*DEALERS* ;

Electrick Motors
Centrifugal Pumps
Automatic Piston Pumps
Deepwell Jet Pumps
A. D. V. Equipments Accessaries
Air Compresser Units
Sprayers
Cushiontyeed Wheels

INDUSTRIAL TROLLY' WHEELS — SWIVEL CASTORS, ETC.,

'ఏదో కదలేశారు. వచ్చిన ఆవేదనని దిగమింగుకోవడం నాకు చేతకాదు. పూర్తిగా వినండి...' అని ఆమె కొంగుతో కళ్ళు అద్దుకుంటూ కొనసాగించింది. 'ఏమన్నా చెయ్యండి గాని, కొట్టొద్దని మాత్రం ఆయన కాళ్ళా వేళ్ళా పడి ప్రాధేయపడేదాన్ని. కాని, నేల మీద పడి పొర్లేటట్లు, ఏడ్వడానికి కూడా శక్తి పోయేట్లు చావ చితుక కొట్టేసేవారు. దుష్టుడని చుట్టుపక్కలవారెవరూ అడ్డువచ్చేవారు కారు, నన్నలాగే వదిలేసి పోయేవారాయన. ఇంట్లో ఒక్కదాన్నే-అలా దుమ్ములో, నేలమీద పడి, బాధతో కుళ్ళికుళ్ళి ఏడ్చి ఏడ్చి, మగత వచ్చి అలాగే నిద్రపోయే దాన్ని. ఆ కాస్సేపే, ఆ మగతే నా కొంత సుఖాన్ని కలిగించేది. అంతకు మించి ఆ కాపరంలో నే నింకేమీ సుఖపడలేదనుకోండి బాబూ!'

ఆమె చెప్పడం ఆపింది. తడైన నా కళ్ళని ఎక్కడ చూస్తుందోనని నేను ముఖం చాటు చేసుకుంటూ, 'మీ కభ్యంతరం లేకుంటే-మీ కథ పూర్తిగా చెప్పండి—వినాలని వుంది' అన్నాను.

'నా ముఖానికో కథ కూడానా? అయినా, మీ రడిగారు గనుక. చెప్తాను వినండి...' అని ప్రారంభించిందామె. 'చిన్నప్పట్నుంచీ నేను తెల్లనివన్నీ పాలు, నల్లని వన్నీ నీళ్ళు అనుకుంటూ-అందరితో ఒకేలా నవ్వుతూ-తుళ్ళుతూ వుండేదాన్ని. అదే నాకిన్ని కష్టనష్టాలూ తెచ్చిపెట్టింది. నేను ఫోర్తుఫారం చదువుతుండగా తోటి స్టూడెంటొకడు నా స్నేహాన్ని అపార్థం చేసుకుని, నన్నేమో చేయాలని చూచాడు. నే నది గ్రహించి, అతన్ని తప్పుకు తిరగసాగాను. దానితో ఆ అబ్బాయి పగబట్టి-స్కూలు గోడల నిండా నా గురించి నానా ఛండాలపు రాతలు-రాసీ, రాయించీ; ఊళ్ళో నామీద లేనిపోని నిందలు ప్రచారం చేసీ, చేయించీ పెద్దగోల లేవదీశాడు. ఫలితంగా నన్ను స్కూలు నుంచి పంపించేశారు. మా యింట్లో కూడా నన్ను నమ్మలేకపోయారు. అందువల్లనే మా నాన్న-దొరికిందే చాలని తనకన్నా కొంచెం పెద్ద వయస్సున్న రెండో పెళ్ళివాడొకడికి నన్నిచ్చి పెళ్ళిచేసి పారేశాడు... పెళ్ళయిన తర్వాత. నా స్కూలు జీవితంలో జరిగిన అలర్లూ-అవీ అన్నీ ఆయనకి తెలిశాయట. (సశేషం)




**MACHINES...**

**THAT EVERY PRINTER NEEDS ! ;**

**PAPER CUTTING MACHINE**

Cutting Length 18 Inches
with Narrow Strip Cutter for Cutting Lables Etc.,

This Machine is of Simple Machanism and Extremely easy to operate. This is Particularly Designed for Small & Medium Establishments. Hight of clamp 4 Inches Fitted with 2 Sheffield knives.

***Other Machines*** :—Board Cutter - Punch Cutting Machine - Treadle Perforator Self - Clamp Round Cornering Machine-Mitreing Machine - Hard Press "Everest" Proof Press - Lever Proof Press - Backing Press - Led and Rule Cutter Etc.,

*MADE BY*

**THE MADRAS TYPE FOUNDRY**

38, JONES ST., :: MADRAS-1.